

విద్యుత్.. కారాదు విపత్తు

విద్యుత్ విషయంలో అప్రమత్తంగా ఉండక పోతే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

- 10లో▸



విస్నూరులో నకిలీ గురువు

పాలకుర్తి మండలం విస్నూరులో నకిలీ దేశ గురువు గ్రామంలోని పుర వీధుల్లో తిరుగుతూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేశారు.

- 10లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో భగీరథ మహర్షి జయంతి



మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆదివారం భగీరథ మహర్షి జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భగీరథ మహర్షి చిత్రపటానికి కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి నర్సింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైతు అవగాహన సదస్సులు

మహబూబాబాద్ రూరల్: ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 5నుంచి జూన్ 13వ తేదీ వరకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు మల్యాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.మాలతి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయనిర్మల ఆదివారం తెలిపారు. ఈమేరకు మొదటి రోజు సోమవారం మహబూబాబాద్ రైతు వేదికలో వివిధ అంశాలపై రైతులకు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. 6న కురవి, 7న గూడూరు, 12న నెల్లికుదురు, 13న సీరోలు మండలం కాంపల్లి, 16న డోర్నకల్, 17న కేసముద్రం, 20న కేసముద్రం మండలం కల్వాల, 23న గార్ల, 24న కొత్తగూడ, 27న బయ్యారం, 30న కురవి మండలం మొగిలిచర్ల, 31న గంగారం, జూన్ 3న మరిపెడ, 5న దంతాలపల్లి, 10న ఇనుగుర్తి, 12న నెల్లికుదురు, 13న నర్సింహులపేటలో రైతు అవగాహన సదస్సులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మల్యాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.మాలతి, శాస్త్రవేత్తలు ఎన్.కిషోర్ కుమార్, ఈ.రాంబాబు, బి.క్రాంతికుమార్ వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొని రైతులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

ఒకటే టికెట్ కౌంటర్.. ప్రయాణికుల పాట్లు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రైల్వే స్టేషన్ రెండో నంబర్ ప్లాట్ ఫాం వైపున గల భవనంలో బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. అయితే అందులో ఒక కౌంటర్ ద్వారా మాత్రమే ప్రయాణికులకు టికెట్లు ఇస్తున్నారు. ఈక్రమంలో ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో క్యూలో ఉండడం, టికెట్ తీసుకునేందుకు ఆలస్యమవుతుండంతో రైళ్లు మిస్ అవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. పలు సందర్భాల్లో టికెట్ లేకుండానే రైళ్లు ఎక్కి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రైల్వేశాఖ అధికారులు స్పందించి స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా టికెట్ బుకింగ్ కౌంటర్లు పెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సార్వత్రిక సమ్మెకు సహకరించాలి

తొర్రూరు: ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెకు అన్ని వర్గాలు సహకరించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఓమ బిక్షపతి, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. ఈ మేరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ కేంద్రంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మచ్చ సురేష్‌కు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మిక వర్గానికి నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు జమ్ముల శ్రీను, శ్రీరాం పుల్లయ్య పాల్గొన్నారు.

సరస్వతి అమ్మవారి విగ్రహం వచ్చేసింది..

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరానికి తమిళనాడులోని మహాబలిపురం నుంచి లారీలో సరస్వతి అమ్మవారి విగ్రహం, నాలుగు వేదమూర్తుల విగ్రహాలు ఆదివారం సాయంత్రం వచ్చాయి. కాళేశ్వరంలో మే 15నుంచి 26వరకు జరుగు సరస్వతినది పుష్కరాల కోసం త్రివేణి సంగమ తీరంపై దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రూ.కోటితో బేస్‌మెంట్‌స్టాండ్ నిర్మాణం, విగ్రహ తయారీ పనులు చేపట్టారు. సోమవారం విగ్రహాన్ని కాంక్రీటు బేస్‌మెంట్ స్టాండ్‌పై ఇన్‌స్టాల్ చేయనున్నారు. అమ్మవారి విగ్రహం చుట్టూర వేదమూర్తులను ఆసీనులు చేస్తారు. తరువాత లాన్, ఇతర సుందరీకరణ పనులు చేపట్టనున్నారు.



పరీక్ష సెంటర్‌లోకి వెళ్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా 'నీట్'

- ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించని అధికారులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగిన నీట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 513 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 494 మంది పరీక్షకు హాజరుకాగా 19మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 1:40గంటలకు ఐదుగురు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో పరీక్షల విభాగం అధికారులు సెంటర్‌లోపలికి అనుమతించలేదు. కాగా సుమారు 10మంది విద్యార్థులు హాల్ టికెట్‌లో కేసముద్రం రోడ్, ఆర్టీసీ బస్టాండ్ అని ఉండడంతో కేసముద్రం మండలానికి వెళ్లారు. అక్కడ స్థానిక పోలీసు సిబ్బందిని తెలుసుకొని మానుకోట సెంటర్‌కు రాగా.. అప్పటికే ఐదుగురికి ఆలస్యమైంది. దీంతో వారిని పరీక్షకు అనుమతించలేదు. వారు కంటతడి పెట్టి వెనుతిరిగి వెళ్లారు. స్పెషల్ ఆఫీసర్‌గా మహబూబాబాద్ తహసీల్దార్ భగవాన్‌రెడ్డి విధులు నిర్వహించారు. కాగా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ రాంనాథ్ కేకన్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. పరీక్ష సెంటర్ వద్ద డీఎస్పీ, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు, 30 మంది సిబ్బంది విధులు నిర్వహించారు.



పరీక్షకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించని అధికారులు



పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

రిటైర్డ్ ఉద్యోగుల ఇబ్బందులు

- పదవీ విరమణ పొంది ఏడాదైనా అందని బెనిఫిట్స్
- రిటైర్మెంట్ డబ్బులపై పెట్టుకున్న ఆశలు గల్లంతు
- ఇంట్లో ఒత్తిడి పెరగడంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ
- తమ డబ్బులు త్వరగా ఇవ్వాలని వేడుకోలు



'జిల్లాకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి తన కూతురు వివాహం కుదుర్చుకున్నాడు. కట్నం డబ్బుల్లో సగం పెళ్లి సమయంలో ఇవ్వడం, మిగిలినవి రిటైర్డ్ డబ్బులు రాగానే ఇస్తామని అంగీకారం కుదుర్చుకున్నాడు. ఎనిమిది నెలల క్రితం వివాహం జరిగింది. ఆ ఉద్యోగి ఆరు నెలల క్రితంపదవీ విరమణ పొందాడు. ఇప్పటికీ డబ్బులు రాకపోవడంతో.. అత్తింటి నుంచి కూతురుకు వేధింపులు మొదలయ్యాయి.'

సాక్షి, మహబూబాబాద్: పదవీ విరమణ పొంది ఏడాది గడిచినా తమకు రావాల్సిన డబ్బులు రాకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు.. ఉద్యోగ సంఘాల కార్యాలయాలు, జిల్లా ట్రెజరీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు, వివిధ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు 8,094, పదవీ విరమణ పొందిన వారు 2,635 మంది మహబూబాబాద్, గూడూరు, మరిపెడ ట్రెజరీ కార్యాలయాల ద్వారా వేతనాలు, పెన్షన్లు పొందుతున్నారు. ఇందులో ఏడాది క్రితం పదవీ విరమణ పొందిన వారు 100 మందికి పైగా ఉంటారు. వీరిలో కొందరికి పెన్షన్ వచ్చినా.. ఇతర బెన్‌ఫిట్స్ కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్నారు.

రూ. 50లక్షలకు పైగా..

ఉద్యోగంలో చేరిన నాటినుంచి ప్రభుత్వ ఉద్యోగులు తమ మూల వేతనం నుంచి ప్రతీ నెల కొంత కటింగ్ పెట్టుకుంటారు. గ్రూపు ఇన్సూరెన్స్, తెలంగాణ రాష్ట్ర గ్రూపు లైఫ్ ఇన్సూరెన్స్, జీపీఎఫ్, కమ్యుటేషన్ వాల్యూ ఆఫ్ పెన్షన్(సీవీపీ), గ్రాట్యుటీ మొదలైన వాటి ద్వారా వేతనంలో కొంత డబ్బును పొదుపు చేసుకుంటారు. ప్రభుత్వం కొంత కలిపి రిటైర్మెంట్ తర్వాత సదరు ఉద్యోగికి చెల్లించాలి. వీటితోపాటు ఉద్యోగి సరెండర్ లీవ్స్‌కు కూడా వెలకట్టి రిటైర్మెంట్ తర్వాత చెల్లించాలి. ఇలా ప్రతీ రిటైర్డ్ ఉద్యోగికి వారిస్థాయిని బట్టి రూ.50లక్షలకు పైగా చెల్లించాల్సి ఉంటుంది.

జిల్లాలోని ఉద్యోగుల వివరాలు

ట్రెజరీ	ఉద్యోగులు	పెన్షనర్లు
మహబూబాబాద్	5,361	1,798
మరిపెడ	1,602	601
గూడూరు	1,131	236
మొత్తం	8,094	2,635

అంతా తారుమారు..

పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే డబ్బుల కోసం వేసుకున్న ప్రణాళిక అంతా తారుమారు అయ్యిందని రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ డబ్బులతో పిల్లల పెళ్లిళ్లు, ఇల్లు కట్టుకోవడం, నిరుద్యోగులైన కుమారులకు ప్రైవేట్ వ్యాపారం పెట్టించడం, చివరకు భార్యకు బంగారం కొనడం వంటి ఆశలు పెట్టుకున్నారు. అయితే పదవీ విరమణ అందరి సమక్షంలో అట్టహాసంగా చేసుకొని బంధువుల ముందు డబ్బులు ఇస్తామని చెప్పామని, ఇప్పుడు సకాలంలో డబ్బులు రాకపోవడంతో మాట తప్పాల్సి వచ్చిందని ఉద్యోగులు అంటున్నారు.

పదవీ విరమణ రోజే డబ్బులు ఇవ్వాలి



ఉద్యోగి పనిచేసిన కాలంలో మూల వేతనం నుంచి కటింగ్ పెట్టుకొని దాచుకున్న డబ్బులు, ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్‌ను ఉద్యోగి పదవీ విరమణ పొందిన రోజే ఇవ్వాలి. అలా కాకుండా జాప్యం చేయడం వల్ల డబ్బులకోసం ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

-సంకా బద్రినారాయణ,
పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

పదకొండు నెలలుగా ఎదురుచూపు



నేను పదవీ విరమణ పొంది పదకొండు నెలలు గడిచింది. సర్వీసులో ఉన్నప్పుడు వచ్చే వేతనం పిల్లల చదువులకోసమే సరిపోయేవి. సర్వీస్‌లో దాచుకున్న డబ్బులు ఇస్తే కూతుర్ల పెళ్లిళ్లు చేద్దామని సిద్ధం అయ్యాను. కానీ ఇప్పటి వరకు డబ్బులు రాలేదు. ప్రభుత్వం త్వరగా డబ్బులు విడుదల చేయాలి.

-గుగులోత్ కిషన్ నాయక్,
రిటైర్డ్ ఉపాధ్యాయుడు

ఆలస్యం చేసే కొద్దీ ఇబ్బందులు పెరుగుతాయి..



ఉద్యోగం చేసే సమయంలో నెల నెల వచ్చే వేతనంతో కాలం గడిచిపోతుంది. పదవీ విరమణ పొందిన తర్వాత ఖర్చులు పెరుగుతాయి. వేతనం కూడా తగ్గుతుంది. దాచుకున్న డబ్బులు, బెనిఫిట్స్ ఆలస్యం చేసే కొద్ది రిటైర్మెంట్ అయిన ఉద్యోగికి ఇబ్బందులు పెరుగుతాయి. పెన్షన్‌తో పాటే అన్ని రకాల డబ్బులు విడుదల చేయాలి.

- మైస శ్రీనివాస్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

బిల్లులు చేసి ప్రభుత్వానికి పంపించాం..



ప్రతీ ఉద్యోగి రిటైర్మెంట్ కాగానే పెన్షన్ ఫాంతోపాటు, ఇతర బెనిఫిట్స్ వివరాలను పరిశీలించి బిల్లులు చేసి ప్రభుత్వానికి పంపిస్తాం. జిల్లాలో రిటైర్డ్ అయిన వారి బిల్స్ చేసి పంపించాం. ప్రభుత్వం నుంచి డబ్బులు మంజూరు కాగానే నేరుగా ఉద్యోగి అకౌంట్‌లోనే డబ్బులు జమ అవుతాయి.

-వెంటపల్లి సత్యనారాయణ,
డీటీఓ, మహబూబాబాద్

అధికారుల నిర్లక్ష్యం..

- వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీపై నీలినీడలు
- ఏడాదవుతున్నా కదలని ఫైల్
- అభ్యర్థులకు తప్పని ఎదురుచూపులు

నెహ్రూసెంటర్: జిల్లా వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎన్‌హెచ్‌ఎం పరిధిలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వచ్చి ఏడాది దాటినా ఫైల్ ముందుకు కదలడం లేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. త్వరగా భర్తీ చేయాలని వారు అధికారులను వేడుకుంటున్నారు.

ఏడాది క్రితం..

ఏడాది క్రితం ఎన్‌హెచ్‌ఎంలో 37 పోస్టులకు నోటిఫికేషన్ జారీచేయగా 1661 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కొన్ని నెలల ఎదురుచూపుల అనంతరం గత ఏడాది నవంబర్‌లో మెరిట్ లిస్టు ప్రకటించి, సర్టిఫికెట్ల వెరిఫికేషన్, కౌన్సెలింగ్ నిర్వహించారు. అదేరోజు 14 పోస్టులను భర్తీ చేశారు. మిగిలిన 23 పోస్టులను వాయిదా వేస్తున్నట్లు వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రకటించారు. కాగా నాటి నుంచి ఫైల్ ముందుకు కదలకపోవడంతో అభ్యర్థుల్లో నిరాశ, ఆందోళన పెరిగింది. కాగా వాయిదా వేసిన ఉద్యోగాల భర్తీకి మార్చి 28న ఫైనల్ జాబితాను విడుదల చేశారు. ఆ రోజు నుంచి ఏప్రిల్ 30వరకు అభ్యంతరాలు స్వీకరించారు. అయితే భర్తీ ప్రక్రియకు మాత్రం మోక్షం కలగడం లేదు.

వాయిదా వేయడంలో ఆంతర్యమేంటి..

కొన్ని పోస్టులను భర్తీ చేసి మిగిలిన పోస్టులు వాయిదా వేయడంలో ఆతర్యం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మెరిట్ లిస్టు ప్రకటించడం వాయిదా వేయడం పరిపాటిగా మారింది. కాగా కొంత మందిని రిక్రూట్ చేసి తమను ఎందుకు ఎంపిక చేయడంలేదని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఎంఎల్‌హెచ్‌పీ-10, ఎస్‌సీడీ స్టాఫ్‌నర్సు-10, ఎంహెచ్‌ఎన్ స్టాఫ్‌నర్సు-02 మొత్తం 22 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.

త్వరలో భర్తీ చేస్తాం..



ఎన్‌హెచ్‌ఎం పరిధిలో జరుగుతున్న ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అధికారుల ఆదేశాల మేరకు భర్తీ చేస్తాం. అభ్యర్థులు ఆందోళన చెందవద్దు. త్వరలోనే భర్తీకి సంబంధించిన సమాచారం అందజేస్తాం.

- రవిరాథోడ్, డీఎంహెచ్‌ఓ

ముగిసిన సృజనోత్సవం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

విద్యారణ్యపురి: జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యాన హనుమకొండ ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో ఐదురోజులుగా నిర్వహిస్తున్న వేసవి సృజనోత్సవం ఆదివారం ముగిసింది. 'భౌతిక శాస్త్రంలో మెళకువలు' అనే అంశంపై సుతారి రమేశ్ అవగాహన కల్పించారు. ఆర్‌పీ శాగంటి మంజుల విద్యార్థులకు డ్రాయింగ్ నైపుణ్యాలను నేర్పించారు. యోగాచార్యులు డాక్టర్ లింగమూర్తి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. బుచ్చిరాములు మ్యాజిక్ తరగతులను నిర్వహించారు. ఈ వేడుకల్లో ముగిసిన సృజనోత్సవ వేడుకలు భాగంగా నిర్వహించిన పాటలు, నృత్యం, ఉపన్యాసం, చిత్రలేఖనం, చదరంగ పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చివరగా శాస్త్రవేత్తలలో ముఖాముఖి నిర్వహించారు. వరంగల్ నిట్ విశ్రాంత ఆచార్యులు సీవీ.రామారావు, ప్రొఫెసర్ ఆంజనేయులు, సుమలత, ఎంఈఓ భిక్షపతి, ఉపాధ్యాయులు కిరణ్, లింగమూర్తి, జేవీవీ ప్రధాన కార్యదర్శి రామంచ భిక్షపతి, బాధ్యులు వేణు, వకుళాభరణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి పల్లకీసేవ

హన్మకొండ కల్చరల్ : వరంగల్ నగరంలోని శ్రీభద్రకాళిభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీభద్రకాళి దేవాలయంలో అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యాన అమ్మవారికి నిత్య పూజలు, అలకరణ అనంతరం ఉత్సవమూర్తికి ఉదయం పల్లకీసేవ, సాయంత్రం శేషవాహనసేవ ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు కుంకుమపూజలు, లలితాసహస్రనామ పారాయణం చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సేవా కార్యక్రమాలకు వరంగల్ ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం, తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం బాధ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, దాసోజు శ్రవణ్‌కుమార్, డాక్టర్ లాల్ కోట వెంకటాచారి, రాగిఫణి రవీంద్రాచారి, చొల్లేటి కృష్ణమాచారి, సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు నారోజు సత్యమనోరమ, శశిధర్‌శిల్పి తదితరులు పాల్గొన్నారు.

సెలవులపై గందరగోళం!

- అంగన్‌వాడీల సెలవులపై క్లారిటీ కరువు
- సర్క్యులర్ రాలేదంటున్న డీడబ్ల్యూఓ
- జిల్లాలో 1,435 అంగన్‌వాడీ కేంద్రాలు



పిల్లల ఎత్తు, బరువు వివరాలు నమోదు చేసుకుంటున్న టీచర్ స్నేహబిందు(ఫైల్)

మహబూబాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రకటించిన మేనెల సెలవులపై అధికారుల నుంచి స్పష్టత కరువైంది. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు గందరగోళానికి గురవుతున్నారు. కాగా, పలు అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్లు వారి పోరాట ఫలితంగానే ప్రభుత్వం మేలో వేసవి సెలవులు ప్రకటించిందని సమావేశాలు ఏర్పాటు చేసి తెలియజేశారు. అయితే డీడబ్ల్యూఓ మాత్రం తమకు ప్రభుత్వ పరంగా సర్క్యులర్ రాలేదని చెబుతున్నారు. దానిపై స్పష్టత లేక కొంతమంది టీచర్లు జిల్లా సంక్షేమశాఖ కార్యాలయానికి ఫోన్ చేసి సెలవులపై ఆరా తీస్తున్నారని సిబ్బంది అంటున్నారు.

1,435 కేంద్రాలు..

జిల్లాలోని ఐదు ప్రాజెక్టుల పరిధిలో 1,435 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. డోర్నకల్ ప్రాజెక్ట్ పరిధిలో డోర్నకల్, గార్ల, కురవి మండలాలు, గూడూరు ప్రాజెక్ట్ పరిధిలో గూడూరు, గంగారం, కొత్తగూడ, మానుకోట పరిధిలో బయ్యారం, కేసముద్రం, మానుకోట, మరిపెడ ప్రాజెక్ట్ పరిధిలో చిన్నగూడూరు, దంతాలపల్లి, మరిపెడ, నర్సింహులపేట మండలాలు ఉన్నాయి. తొర్రూరు ప్రాజెక్ట్ పరిధిలో తొర్రూరు, నెల్లికుదురు, పెద్దవంగర మండలాలు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టుల పరిధిలో జీరో నుంచి ఆరు నెలలలోపు పిల్లలు 3604మంది, ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాలలోపు పిల్లలు 20,295మంది, మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు 16,181 మంది ఉన్నారని అధికారులు తెలిపారు. సొంత భవనాల్లో 339 కేంద్రాలు, అద్దె భవనాల్లో 452, అద్దె లేకుండా (ఫ్రీ రెటెండ్) భవనాల్లో 644 కేంద్రాలు కొనసాగుతున్నాయి.

పోషణ లోపంతో 1,490 మంది..

కేంద్రాల్లో ప్రతీ నెల 1నుంచి 5వ తేదీ వరకు వెయింగ్ మిషన్‌తో పిల్లల బరువు, ఎత్తు కొలవాలి. వివరాలను టీచర్లు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఎన్‌హెచ్‌టీఎస్ యాప్(న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్), కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాలి. దీంతో పిల్లల ఆరోగ్య స్థితి తెలుస్తుంది. వారిలో తీవ్ర పోషణలోపం, అతి తీవ్ర లోపం ఉన్న పిల్లలను గుర్తిస్తారు. కాగా జిల్లాలో గత నెల తీవ్ర పోషణ లోపంతో 1,281 మంది, అతి తీవ్ర పోషణలోపంతో 209 మంది ఉన్నట్లు గుర్తించారు.

చికిత్స విధానం ఇలా ..

తీవ్ర పోషణ, అతి తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లలను పీహెచ్‌సీకి తీసుకెళ్లి డాక్టర్‌కు చూపించి మందులు ఇప్పిస్తారు. అతి తీవ్రత పోషణ లోపంతో ఇబ్బంది పడితే ఎన్ఆర్‌బీ(న్యూట్రిషన్ రిహాబిటేషన్ సెంటర్)కు పంపిస్తారు. వరంగల్, ఖమ్మంలో ఒక్కో సెంటర్ చొప్పున ఉన్నాయి. అక్కడ పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులు ఉంటారు. పిల్లలతో పాటు వెళ్లే తల్లిదండ్రులకు ఉచిత భోజన వసతి కల్పిస్తారు. తల్లిదండ్రులకు రోజువారీగా ఎంత కూలీ వస్తుందో తెలుసుకుని, ఆ మొత్తం డబ్బులను ఇస్తారని అధికారులు తెలిపారు.

గందరగోళం..

సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌తో పాటు పలు యూనియన్ల ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా కేంద్రాలకు మే నెలలో వేసవి సెలవులు ఇవ్వాలని ఆందోళన చేశారు. ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంపూర్ణ, స్నేహబిందు ప్రభుత్వం సెలవు ప్రకటించినట్లుగా సమావేశాలు నిర్వహించి తెలియజేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సీఐటీయూ యూనియన్ నాయకులు గత నెల 29న ములుగు జిల్లాలోని మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట చేసిన ఆందోళన చేయగా.. మంత్రి సీతక్క స్పందించి సెలవులు ప్రకటించారని టీచర్లు, ఆయాలకు చెప్పారు. దీంతో సెలవులు ప్రకటించారని జిల్లా కేంద్రంలో ఈనెల 1న కొంత మంది కేంద్రాలను తెరువ లేదు. మళ్లీ కార్యాలయానికి ఫోన్ చేయగా సెలవులు ప్రకటించలేదని చెప్పడంతో తర్వాత కేంద్రాలను తెరిచారు. స్పష్టత రాకపోవడంతో పాత పద్ధతిలో నెలలో 15 రోజులు టీచర్, 15 రోజులు ఆయా పని చేయాల్సి వస్తోంది.

> **కలెక్టర్ సమీక్ష**
>
> కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 1న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ జిల్లా సంక్షేమశాఖ అధికారులతో పిల్లల్లో పోషణ లోపంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కాగా ఈనెల 2 నుంచి టీచర్లు ఆపనిలో నిమగ్నమయ్యారు. కలెక్టర్ ఆదేశాలతో చాలా సీరియస్‌గా పని చేస్తున్నారు.

మూడు సంవత్సరాల లోపు పిల్లలకు టీహెచ్ఆర్..

మూడు సంవత్సరాలలోపు పిల్లలకు మాత్రమే టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్)కింద బాలామృతం, 16 గుడ్లు ఇస్తున్నారు. అయితే వేసవి సెలవులు ప్రకటిస్తే ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు కూడా టీహెచ్ఆర్ విధానం ద్వారా పాలు, గుడ్లు, బాలామృతం, ఇతరత్రా సరుకులు ఇవ్వాల్సి ఉంటుంది.

సెలవులు ఇచ్చినా అందుబాటులో ఉండాల్సిందే..

వార్షిక సర్వే, ఇంటింటి సందర్శన, ప్రీస్కూల్ పిల్లల నమోదు, డ్రాఅవుట్ అడ్మిషన్ చేయడం లాంటి పనులు చేయాల్సి ఉంటుంది. గర్భిణుల వివరాలు నమోదు తదితర పనులు చేయాల్సిందే. వేసవిలో 15 రోజుల సెలవుల వెసులుబాటు కల్పించినా అందుబాటులో ఉండాల్సిందే.

సెలవుల విషయంలో సర్క్యులర్ రాలేదు..

మే నెల వేసవి సెలవుల విషయంలో ప్రభుత్వం నుంచి సర్క్యులర్ రాలేదు. కొంత మంది యూనియన్ నాయకురాళ్లు ప్రభుత్వం సెలవు ప్రకటించిందని చెబుతున్నారు. కానీ, పాత పద్ధతిలోనే కేంద్రాల నిర్వహణ చేపట్టాలి. తీవ్ర, అతి తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లలను గుర్తించే పనిలో టీచర్లు నిమగ్నమయ్యారు. కలెక్టర్ ఆదేశాలతో వివరాల నమోదు వేగవంతం చేస్తాం. పిల్లల్లో ఆసమస్య లేకుండా చేస్తాం.

-ధనమ్మ, డీడబ్ల్యూఓ

కార్యకర్తల కష్టంతోనే అధికారంలోకి వచ్చాం

- టీపీసీసీ పరిశీలకురాలు రవళిరెడ్డి, ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: కార్యకర్తల కష్టంతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని టీపీసీసీ పరిశీలకురాలు కూచన రవళిరెడ్డి, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మానుకోటలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పార్టీ జిల్లా సంస్థాగత, నిర్మాణ సన్నాహక సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీ బలంగా ఉంటేనే కార్యకర్తలు బలంగా ఉంటారని, నాయకులైనా, కార్యకర్తలైనా పార్టీని ఇబ్బంది పెట్టేవిధంగా వ్యవహరించకూడదని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టాలని, అప్పుడే సరైన నాయకత్వానికి అవకాశం ఉంటుందన్నారు. సిఫార్సుల ద్వారా, నామినేటెడ్‌గా పదవులు ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో కార్యకర్తల సమక్షంలో సమావేశాలు నిర్వహించి అర్హతను బట్టి పదవులు కేటాయించాలని సూచించారు. ఒక నియమావళిని రూపొందించి దానికి అనుగుణంగా కమిటీలు ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, టీపీసీసీ పరిశీలకుడు నాగేశ్వర్‌రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ పరిశీలకురాలు రవళిరెడ్డి, వేదికపై ఎమ్మెల్యే మురళీనాయక్

క్లుప్తంగా

బీసీ, ఎస్సీ, ఎస్టీలు చైతన్యవంతులవ్వాలి

● రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి చిరంజీవులు



మాట్లాడుతున్న రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి చిరంజీవులు

కాజీపేట రూరల్‌: బీసీ, ఎస్సీ, ఎస్టీలు గ్రామ స్థాయి నుంచి సామాజికంగా చైతన్యవంతులు కావాలని రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి చిరంజీవులు అన్నారు. కాజీపేట ఫాతిమానగర్‌ వైష్ణవి గ్రాండ్‌ హోటల్‌లో ఆదివారం జరిగిన సామాజిక న్యాయం, రాజ్యాధికారం కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సన్నాహక, ఆవిర్భావ సమావేశంలో విశిష్ట అతిథిగా హాజరైన చిరంజీవులు మాట్లాడుతూ.. జేఏసీని బలోపేతం చేసి గ్రామగ్రామాన బీసీ, ఎస్సీ, ఎస్టీలు సామాజికంగా చైతన్యవంతులైతేనే రాజ్యాధికారం వస్తుందన్నారు. 1 శాతం లేని వెలమలు ఈ రాష్ట్రాన్ని 10 ఏళ్ల నుంచి పాలించారని, ఎస్సీ, ఎస్టీ, బీసీలు అంతా కలిసి 90 శాతం ఉన్నప్పటికీ అధికారానికి, సంపదకు దూరంగా ఉంటున్నారన్నారు. జేఏసీ స్టేట్‌ కన్వీనర్‌ డాక్టర్‌ విశారదన్‌ మహరాజ్‌ మాట్లాడుతూ.. జేఏసీ ఆధ్వర్యంలో సామాజిక తెలంగాణ సాధిస్తామన్నారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ నాగం కుమారస్వామి, డాక్టర్‌ ఎంఎఫ్‌.గోపీనాథ్‌, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణగౌడ్‌, దాసోజు లలిత, సాయిని నరేందర్‌, డాక్టర్‌ కూరపాటి రమేశ్‌, డాక్టర్‌ లేఖిని సంపత్‌, శ్రీనివాస్‌ ముదిరాజ్‌, రాసాల వినోద్‌యాదవ్‌, పూసల సాయిబాబా, మేకల సుమన్‌, వడ్డెపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్‌ చేశారు.. బ్యాండేజ్‌ క్లాత్‌ మరిచారు

● కమలాపూర్‌ సీహెచ్‌సీలో వైద్యుల నిర్లక్ష్యం..బాలింతకు నొప్పులు
● ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన



తీవ్ర నొప్పితో బాధపడుతున్న తిరుమల



ఆపరేషన్‌ చేసి తీసిన బ్యాండేజ్‌ క్లాత్‌

కమలాపూర్‌: హనుమకొండ జిల్లా కమలాపూర్‌ మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఓ గర్భిణికి ఆపరేషన్‌ చేసి బ్యాండేజ్‌ క్లాత్‌ మరిచారు. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్‌ మండలం ఉప్పల్‌కు చెందిన అంబ్రాసి తిరుమల వారం క్రితం ప్రసవం కోసం కమలాపూర్‌ సీహెచ్‌సీకి వచ్చింది. వైద్యులు ఆపరేషన్‌ చేశారు. ఆతర్వాత ఓ బ్యాండేజ్‌ క్లాత్‌ బయటకు తీయకుండా వదిలేశారు. దీంతో తిరుమలకు తీవ్రమైన నొప్పులు వచ్చాయి. వెంటనే కుటుంబ సభ్యులు సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఆమెకు ఆపరేషన్‌ చేసిన డాక్టర్‌ అందుబాటులో లేకపోవడంతో అక్కడే ఉన్న మరో వైద్యుడు ఆపరేషన్‌ చేసిన వైద్యురాలితో ఫోన్‌లో మాట్లాడి ఆ బ్యాండేజ్‌ క్లాత్‌ను తొలగించారు. ప్రసూతి కోసం ఆస్పత్రికి వస్తే ఫోన్‌ మాట్లాడుతూ.. నిర్లక్ష్యంగా ఆపరేషన్‌ చేసి బ్యాండేజ్‌ క్లాత్‌ మరిచిపోయారని బంధువులు చెబుతున్నారు. కాగా.. ప్రభుత్వాస్పత్రులపై నమ్మకంతో వస్తే వారు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని, పరిస్థితి విషమించి జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని బాలింత బంధువులు ఆస్పత్రిలో ఆందోళనకు దిగారు.

విద్యుత్‌.. కారాదు విపత్తు

ఆదమరిస్తే ప్రాణాలకే ముప్పు

● నిరంతరం అప్రమత్తత అవసరం
● విద్యుత్‌ సమస్యలు తలెత్తితే సొంతంగా రిపేర్లు చేయొద్దు
● 1912 టోల్‌ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌ చేయాలి..



హన్మకొండ: విద్యుత్‌ విషయంలో అప్రమత్తంగా ఉండకపోతే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. ప్రధానంగా వర్షాకాలం వచ్చిందంటే తరచూ విద్యుత్‌ ప్రమాదాలు సంభవిస్తుంటాయి. తడిదుస్తులు ఆరేస్తూ.. మోటార్లు ఆన్‌ చేస్తూ.. మరమ్మతుల సమయంలో కరెంటు తీగలు పట్టుకోవడం.. తెగిన తీగల కారణంగా తరచూ విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. తెగిపోయిన విద్యుత్‌ లైన్లు, టాన్స్‌ఫార్మర్‌ గద్దెలు ఎత్తు తక్కువగా ఉండడంతో పశువులు విద్యుదాఘాతానికి గురై చనిపోతున్నాయి. విద్యుత్‌ సిబ్బంది నిర్లక్ష్యంతో భద్రతా చర్యలు పాటించకపోవడమూ ఈప్రమాదాలకు ఒక కారణంగా చెప్పవచ్చు. ఈ క్రమంలో విద్యుత్‌ ఉద్యోగులు, వినియోగదారులను అప్రమత్తం చేయడంతోపాటు అవగాహన కల్పించడానికి ఎన్పీడీసీఎల్‌ యాజమాన్యం ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు 'విద్యుత్‌ భద్రతా వారోత్సవాలు' నిర్వహిస్తోంది.

ప్రమాదాల నివారణకు పెద్దపీట

విద్యుత్‌ ప్రమాదాల నివారణకు యాజమాన్యం పెద్దపీట వేస్తోంది. జీరో విద్యుత్‌ ప్రమాదాలు లక్ష్యంగా ముందుకు వెళ్తోంది. సర్కిల్‌లోని డీఈ టెక్నికల్‌ అధికారులను సేఫ్టీ అధికారులుగా నియమించగా.. వినియోగదారులకు, ముఖ్యంగా రైతులకు అవగాహన కల్పిస్తూ విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. అలాగే భద్రతపై ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ సిబ్బందికి అన్ని రకాల రక్షణ పరికరాలు, హెల్మెట్‌, గ్లోవ్స్‌, పోర్టబుల్‌ ఎర్తింగ్‌, షార్ట్‌సర్క్యూట్‌ కిట్లు, సేఫ్టీ షూస్‌, ఇన్సులేటెడ్‌ టూల్స్‌, ఓల్టేజ్‌ డిటెక్టర్‌ వంటివి అందించింది.

- హనుమకొండ జిల్లాలో 4,86,266 మంది విద్యుత్‌ వినియోగదారులున్నారు. ఇందులో 3,61,540 మంది గృహ విద్యుత్‌, 67,573 మంది వ్యవసాయ విద్యుత్‌ కనెక్షన్లు ఉన్నాయి. 33/11 కేవీ విద్యుత్‌ సబ్‌స్టేషన్లు 74 ఉండగా.. 12,489 డిస్ట్రిబ్యూషన్‌ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్‌ సరఫరా అవుతోంది.
- వరంగల్‌ జిల్లాలో 4,20,925 మంది విద్యుత్‌ వినియోగదారులు ఉండగా.. అందులో, గృహ విద్యుత్‌ 2,99,091, వ్యవసాయ విద్యుత్‌ కనెక్షన్లు 70,853 ఉన్నాయి. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లు 76 ఉండగా.. 12,467 డిస్ట్రిబ్యూషన్‌ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్‌ సరఫరా జరుగుతోంది.

విద్యుత్‌ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి..



విద్యుత్‌ ప్రమాదాలు జరగకుండా వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్‌ సమస్యలు వస్తే సంబంధిత ఏఈ, సిబ్బందికి తెలియజేయాలి. ప్రతి నెలా జారీ చేసే బిల్‌ కమ్‌ నోటీస్‌పై ఏఈ, లైన్‌మెన్‌ ఫోన్‌ నంబర్‌ ఉంటుంది. విద్యుత్‌ సమస్యలు వస్తే నిపుణులైన ఎలక్ట్రీషియన్‌తో సరిచేసుకోవాలి.

– పి.మధుసూదన్‌ రావు, ఎస్‌ఈ, హనుమకొండ సర్కిల్‌

ఉద్యోగులు భద్రతా ప్రమాణాలు పాటించాలి..



విద్యుత్‌ ఉద్యోగులు భద్రతా ప్రమాణాలు పాటించాలి. రక్షణ పరికరాలు వినియోగించాలి. విద్యుత్‌ ప్రమాదాలను నివారించడానికి క్షేత్ర స్థాయి సిబ్బందితో పాటు అధికారులందరి సమష్టి కృషి అవసరం. విద్యుత్‌ సమస్యలు తలెత్తితే 1912 టోల్‌ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌ చేయాలి. ఈ విషయమై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాం.

– కె.గౌతంరెడ్డి, ఎస్‌ఈ, వరంగల్‌ సర్కిల్‌

పాటించాల్సిన సూచనలు

- వర్షం కురుస్తున్నప్పుడు, కురిసిన తర్వాత తడిసిన విద్యుత్‌ స్తంభాల స్టేవైరు, సపోర్టు వైరును, తడిచిన విద్యుత్‌ ఉపకరణాలను తాకొద్దు.
- దండెం వైర్లను, విద్యుత్‌ వైర్లను కలుపకూడదు. సపోర్ట్‌ వైర్లుగా ఇన్సులేటెడ్‌ జీ.ఐ వైర్లను ఉపయోగించాలి.
- ప్రజలు, వినియోగదారులు విద్యుత్‌ స్తంభాలు, విద్యుత్‌ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సర్వీస్‌ వైర్ల తాకకుండా దూరంగా నడవాలి.
- ఓల్టేజీలో హెచ్చు తగ్గులు ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తున్నా వెంటనే విద్యుత్‌ శాఖ వారికి తెలియజేయాలి.
- వర్షాలతో చెట్టు లేక చెట్ల కొమ్మలు విద్యుత్‌ వైర్లకు తాకి షాక్‌ వచ్చే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. వాటిని తాకకుండా విద్యుత్‌ శాఖ వారికి తెలియజేయాలి.
- వ్యవసాయ నిమిత్తం, గృహాలలో అతుకులు లేని సర్వీసు వైరు మాత్రమే ఉపయోగించాలి.
- తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్‌ తీగలను తాకొద్దు. వెంటనే సంబంధిత విద్యుత్‌ సిబ్బందికి తెలియజేయాలి.
- ఎవరికైనా పొరపాటున కరెంట్‌ షాక్‌ సంభవిస్తే దగ్గరలో ఉన్న వ్యక్తులు షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించాలన్న ఆత్రుతతో అతడిని ముట్టుకోవద్దు. షాక్‌కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్‌ ప్రవహించని(కర్ర, ప్లాస్టిక్‌ లాంటి) వస్తువులను వినియోగించాలి.
- రైతులు వ్యవసాయ అవసరాల నిమిత్తం వినియోగిస్తున్న కరెంట్‌ మోటార్లను లేదా పైపులను లేదా ఫుట్‌ వాల్వులను ఏమరపాటుతో తాకొద్దు. పంపు సెట్లకు, స్టార్టర్లకు విధిగా ఎర్త్‌ చేయాలి. ఎర్త్‌ చేయని మోటార్లు, స్టార్టర్లు, జీ.ఐ పైపులు, ఫుట్‌ వాల్వ్‌లను తాకడం అత్యంత ప్రమాదకరం.
- డిస్ట్రిబ్యూషన్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్‌ చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- మోటారు పంపుసెట్లకు ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే సొంతంగా సరిచేసే ప్రయత్నం ప్రాణాపాయంతో కూడుకున్నది. రిపేరు వర్క్‌ తెలిసిన వారితోనే చేయించాలి.
- గ్రామీణ వినియోగదారులు తమ పరిధి క్షేత్ర స్థాయి విద్యుత్‌ సిబ్బందికి లైన్‌మెన్‌, లైన్‌ ఇన్‌స్పెక్టర్‌, సీనియర్‌ లైన్‌ ఇన్‌స్పెక్టర్‌, సబ్‌ ఇంజనీర్‌, సెక్షన్‌ ఆఫీసర్‌లను సంప్రదించి వారి సేవలు పొందాలి.
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, రక్షణ పరికరాలు అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత తరుణంలో వాటిని వినియోగించడం ద్వారా ప్రమాదాల నుంచి బయటపడవచ్చు.
- విద్యుత్‌ పరికరాలు, వైరింగ్‌, వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు బ్యూరో ఆఫ్‌ ఇండియన్‌ స్టాండర్డ్స్‌, గుర్తింపు కలిగినవి వాడాలి.

మార్కెట్‌ సంఘానికి రాజకీయ రంగు

● సీల్డ్‌ కవర్‌లో లక్ష్మీపురం మార్కెట్‌ అధ్యక్ష, కార్యదర్శుల పేర్లు
● వ్యతిరేకిస్తున్న కమీషన్‌ వ్యాపారులు
● కొత్త సంఘం ఏర్పాటుకు సిద్ధం?



వరంగల్‌లోని లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌

వరంగల్‌: వరంగల్‌ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లోని కమీషన్‌ వ్యాపారస్తుల సంఘం ఏర్పాటుకు రాజకీయ రంగు పులుముకుంది. 2018లో ఏర్పడిన కూరగాయల కమీషన్‌ వ్యాపారుల సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని వ్యాపారులు డిమాండ్‌ చేయడంతో 29జూన్‌ 2024న రద్దు చేస్తున్నట్లు అప్పటి అధ్యక్షుడు జారతి శ్రీనివాస్‌ ప్రకటించారు. నెలరోజుల్లో ఏర్పాటు చేసేందుకు ఐదుగురు సభ్యులతో అడ్‌హక్‌ కమిటీని ఏర్పాటు చేశారు. సంఘం లెక్కల పేరుతో ఆర్నెళ్లపాటు వాయిదా వేశారు. 11ఆగస్టు 2024న అడ్‌హక్‌ కమిటీ సభ్యులు ఏకగ్రీవంతో నూతన కమిటీ ఏర్పాటు చేసేందుకు అదే నెల 13న సమావేశం ఏర్పాటు చేశారు. ఈవిషయం తెలిసిన మార్కెట్‌లోని ఒక వర్గం అధికార పార్టీ నాయకుని అనుయాయునికి చెప్పి మరోసారి వాయిదా వేయించారు. గతంలో జరిగిన విధంగానే ఈసారి కూడా తాము చెప్పిన వారే అధ్యక్ష, కార్యదర్శులుగా ఉంటారని సదరు నాయకుడు ఆదేశాలు జారీ చేయడంతో ఆవిషయం తెలిసిన వ్యాపారులు వ్యతిరేకిస్తూ ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌ చేశారు. దీంతో ఎన్నిక మరోసారి వాయిదా పడింది.

కమిటీలేక సమస్యలు అపరిష్కృతం

మార్కెట్‌లో కమిటీ లేక పోవడంతో వ్యాపారుల సమస్యలు పేరుకుపోవడంతో నూతన కమిటీని ఎలాగైనా ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ వచ్చింది. 11 డిసెంబర్‌ 2024లో వ్యాపారులంతా సమావేశమై అన్ని కమిటీలు రద్దు చేస్తూ నెల రోజుల్లో నూతన కమిటీ ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈమేరకు మూడు నెలల తర్వాత మార్చి 29న కమీషన్‌ వ్యాపారులంతా కలిసి చింతల్‌ బ్రిడ్జి సమీపంలో ఒక హోటల్‌లో వ్యాపారులు సమావేశమయ్యారు. మార్కెట్‌లో లైసెన్సులు కలిగిన 91 మందిలో 60 మంది హాజరు కాగా.. ఒక వర్గానికి చెందిన కొందరు వ్యాపారులు గైర్హాజరయ్యారు. ఈలోగా.. వ్యాపారుల్లో ఉన్న ప్రజాప్రతినిధి సూచన మేరకు మరోసారి సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకుంటే బాగుంటుందని చెప్పడంతో ఆ సమావేశాన్ని వాయిదా వేస్తూ.. ఏప్రిల్‌ 4న నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు ఇద్దరు సీనియర్‌ వ్యాపారులను ఎన్నికల అధికారులుగా నియమిస్తూ సమావేశంలో తీర్మానించారు. ఎన్నికల కమిటీ ఏప్రిల్‌ 2న నామినేషన్లు వేయాలని, 4న ఎన్నిక పోలింగ్‌ నిర్వహిస్తామని ప్రకటించింది. ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహిస్తే కమిటీ చేజారి పోతుందని భావించిన వ్యాపారులుగా ఉన్న అధికార పార్టీ నాయకులు ఈఎన్నికలను సైతం వాయిదా వేయించారు. గత ఎన్నికల్లో బహిరంగంగా ఆరోపణలు చేసిన వారే ఈవ్యవహారంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు జరిగితే మోడల్‌ మార్కెట్‌ మారి సందర్భంలో పాట్ల కేటాయింపుల్లో జరిగిన అవకతవకలు బహిర్గతమవుతాయన్న ఉద్దేశ్యంతోనే కొంత మంది సామాజిక వర్గం పేరుతో కమిటీ అధ్యక్ష పదవిని కైవసం చేసుకోవాలని చూస్తున్నట్లు వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

సీల్డ్‌ కవర్‌లో కమిటీ..

ఈనెల 6న ఒక ఫంక్షన్‌ హాల్‌లో జరిగే సమావేశంలో నూతన కమిటీ ఏర్పాటవుతుందని, ఈసమావేశానికి అధికార పార్టీకి చెందిన నాయకులు వచ్చి అధ్యక్ష, కార్యదర్శుల పేర్లు ప్రకటిస్తారని ఆదివారం మార్కెట్‌లో ప్రచారం జరిగింది. కూరగాయలు అమ్ముకునే వ్యాపారులకు రాజకీయ రంగు పులమడం సరికాదని కమీషన్‌ వ్యాపారులు వాపోతున్నారు. గతంలో ఇలానే కమిటీ ఏర్పాటు కావడం వల్ల ఎలాంటి లబ్ధి వ్యాపారులకు చేకూరలేదని అంటున్నారు. అధికార పార్టీ నేతలు వ్యాపారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలా కాని పక్షంలో కొత్త సంఘం ఏర్పాటు చేసుకునేందుకు కమీషన్‌ వ్యాపారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మంగపేట: మండలంలోని మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయంలోని స్వయంభు లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు శేఖర్‌శర్మ, పవన్‌కుమార్‌, ఈశ్వర్‌చంద్‌ స్వామివారికి తిలతైలాభిషేకం పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులు స్వామివారి నిజరూప దర్శనం చేసుకున్నారు. సంతానం లేని దంపతులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

విస్నూరులో నకిలీ గురువు

● మాయమాటలతో రూ. 1.30 లక్షలు వసూలు
● నిలదీసిన గ్రామస్తులు.. పారిపోయిన మోసగాడు
● డబ్బులు చెల్లించిన అతడి అనుచరులు



విస్నూరులో నకిలీ గురువు అనుచరుడిని నిలదీస్తున్న గ్రామస్తులు

పాలకుర్తి టౌన్‌: జనగామ జిల్లా పాలకుర్తి మండలం విస్నూరులో ఓ వ్యక్తి విచిత్ర వేషధారణతో తన అనుచరులతో గ్రామంలో గుర్రంపై చక్కర్లు కొట్టాడు. జనానికి శఠగోపం పెట్టాలని పన్నాగం వేశాడు. మీఊరిని క్షుద్రశక్తులు ఆవహించాయి.. కీడు సోకిందని నమ్మించి జనం అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని గ్రామ పెద్దలతో నమ్మబలికి గ్రామంలో ఒక చోట బస చేశాడు. గ్రామంలో పుర వీధుల్లో గుర్రంపై తిరుగుతూ కుటుంబాల్లో సమస్యలున్నాయని బాగు చేస్తానని ప్రజలను నమ్మించాడు. ఒక్కొక్కరు రూ.2 వేలు నుంచి రూ.15 వేలు వరకు నకిలీ దేశగురువుకు ముడుపులు చెల్లించారు. డబ్బులు లేక కొంత మంది 5 క్వింటాళ్ల బియ్యంతోపాటు గొర్రె పిల్లలు అందజేశారు. నకిలీ దేశ గురువు అనుచరులను విస్నూరు మాజీ ఎంపీటీసీ మాటూరి యాకయ్యతో పాటు గ్రామస్తులు పట్టుకుని ప్రశ్నించారు. వారి ద్విచక్ర వాహనాలను గుర్రాన్ని తరలించే వాహనాన్ని స్వాధీనపర్చుకున్నారు. గ్రామస్తుల నుంచి రూ.1.30 లక్షలు వసూలు చేశామని ఒప్పుకున్నారు. వసూలు చేసిన డబ్బులు చెల్లించే వరకు ఎటూ వెళ్లకూడదని వారిని గ్రామస్తులు చుట్టుముట్టారు. దీంతో నకిలీ దేశ గురువు అనుచరులు ఫోన్‌పే ద్వారా డబ్బులు తిరిగి చెల్లించారు. కాగా.. సూర్యాపేట జిల్లా మండలం పెన్‌పహాడ్‌ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన రాజశేఖర్‌స్వామి నకిలీ దేశగురువుగా గ్రామాల్లో సంచరిస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈవిషయంపై పోలీసులను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

మౌంటైనర్‌ మరో సాహసం

● మణిపూర్‌లోని ఇసో పర్వతాన్ని అధిరోహించిన యశ్వంత్‌



మణిపూర్‌ ఇసో పర్వతంపై సైనిక అధికారులతో కలిసి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న యశ్వంత్‌

మరిపెడ రూరల్‌: మహబూబాబాద్‌ జిల్లా మరిపెడ మండలం భూక్య తండాకు చెందిన మౌంటైనర్‌ యశ్వంత్‌ మరో అరుదైన సాహసాన్ని విజయవంతంగా పూర్తి చేశాడు. మణిపూర్‌ రాష్ట్రంలోని ఎత్తైన పర్వతం ఇసో 2,994 మీటర్ల ఎత్తును ఆదివారం అధిరోహించి మరో రికార్డు సొంతం చేసుకున్నాడు. యశ్వంత్‌ ఇప్పటికే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పలు పర్వతాలను అధిరోహించి పిన్న వయస్సు గిరిజన సాహసకుడిగా పేరు తెచ్చుకున్నాడు. జాతీయ మిషన్‌ 'హర్‌ శిఖర్‌ పర్‌ తిరంగా'లో మౌంటైనర్‌ యశ్వంత్‌.. ఇసో అస్సాం రైఫిల్‌ 16వ బెటాలియన్‌కు చెందిన కల్నల్‌ సందీప్‌ శర్మ, లెఫ్టినెంట్‌ కల్నల్‌ సిద్ధార్థ్‌తో కలిసి ఇసో పర్వతంపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశాడు. యశ్వంత్‌ ఇప్పటికే కిలిమంజారో, ఎల్బ్రస్‌, మౌంట్‌ కోస్కియుస్కో పర్వతాలను చుట్టేసి దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటడం గొప్ప విషయం.

వేర్వేరు కారణాలతో నలుగురి మృతి

ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో ఆదివారం జరిగిన వివిధ ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు.

● లారీ ఢీ.. కబడ్డీ క్రీడాకారుడి దుర్మరణం



ఉదయ్‌కుమార్‌ (ఫైల్‌)

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన గోవిందు ఉదయ్‌కుమార్‌(23) లారీ ఢీకొని శనివారం రాత్రి మృతి చెందాడు. ఉదయ్‌ తండ్రి సమ్మయ్య పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన ప్రాణం పోయే చివరి క్షణాలలో లాయర్‌ కావాలని ఉదయ్‌ని కోరాడు. తండ్రి కోరిక మేరకు హనుమకొండలోని ఆదర్శ లా కాలేజీలో ఎల్‌ఎల్‌బీ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. మరోవైపు రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారుడిగా ఎదిగాడు. మరో ఏడాదైతే లా పట్టా పుచ్చుకునే వాడు. ఈక్రమంలో శనివారం రాత్రి హనుమకొండ హంటర్‌ రోడ్డులో బైక్‌పై వెళ్తున్న ఉదయ్‌కుమార్‌ను లారీ ఢీకొట్టడంతో ఎగిరి డివైడర్‌ మీదపడి అతడు మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లి సరోజన రోదనలు మిన్నంటాయి. ఆదివారం ఉదయ్‌ మృతదేహం స్వగ్రామానికి తీసుకురాగా వందలాది మంది కబడ్డీ క్రీడాకారులు గిర్నిబావి నుంచి నాచినపల్లి వరకు 3 కిలోమీటర్ల మేర భారీ ర్యాలీ నిర్వహించారు. కబడ్డీ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు ఆర్‌. రాంరెడ్డి, అసోసియేషన్‌ ప్రతినిధులు కక్కెర్ల మల్లికార్జున్‌, పుప్పాల ఎల్లయ్య ఉదయ్‌ మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్‌..



యాదగిరి (ఫైల్‌)

రఘునాథపల్లి: హనుమకొండ–హైదరాబాద్‌ జాతీయ రహదారిలోని కోమల్ల టోల్‌ ప్లాజా వద్ద శనివారం రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరి మాజీ సర్పంచ్‌ ముప్పిడి యాదగిరి (52) మృతి చెందాడు. యాదగిరి తన బైక్‌పై జనగామలో ఉన్న చెల్లెలి వద్దకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. కోమల్ల టోల్‌ ప్లాజా వద్ద ముందు వెళ్తున్న టాటా ఏస్‌ వాహనాన్ని డ్రైవర్‌ నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలిపాడు. దీంతో బైక్‌పై వస్తున్న యాదగిరి టాటా ఏసీ వాహనాన్ని వెనకాల నుంచి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన యాదగిరిని జనగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడి కుమారుడు ప్రదీప్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్‌ తెలిపారు.

తాటి చెట్టు నుంచి పడి గీత కార్మికుడు..

రాయపర్తి: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన నాల్లం యాదగిరి(54) తాటిచెట్టు పైనుంచి పడి శనివారం సాయంత్రం మృతిచెందాడు. యాదగిరి వృత్తిని నమ్ముకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కల్లుగీస్తుండగా.. ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా రాత్రి 11:30 గంటలకు మృతిచెందాడు. ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రవణ్‌కుమార్‌ తెలిపారు



యాదగిరి (ఫైల్‌)

వడదెబ్బతో ఉపాధి కూలీ..



సర్వయ్య(ఫైల్‌)

గూడూరు: వడదెబ్బతో మండలంలోని అప్పరాజ్‌పల్లికి చెందిన ఉపాధి కూలీ మండల సర్వయ్య (50) ఆదివారం మృతి చెందాడు. సర్వయ్య శనివారం ఉదయం గ్రామ సమీప రోడ్డు పక్కన గుంతలు తవ్వే పనులకు వెళ్లి వచ్చాడు. ఆ తర్వాత పొద్దంతా ఎండ వేడితో, కడుపునొప్పితో బాధ పడ్డాడు. రాత్రి నిద్రపోయి ఉదయం విగత జీవిగా మారాడు. తన భర్త వడదెబ్బతో చనిపోయాడని భార్య అన్నపూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

'మధుగురు అక్షర యజ్ఞం' సంచిక విడుదల

ములుగు: 'మధుగురు అక్షరయజ్ఞం' ప్రచార సంచికను ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా విడుదల చేశారు. ఈసందర్భంగా అక్షరయజ్ఞం నిర్వాహకులు మధుకర్‌ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉన్నత చదువులు, పెద్దలకు ఉపాధి అవకాశాలను అందించాలనే లక్ష్యంతో జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా, చిట్యాల మండలంలోని జూకల్‌లో విద్యా వికాస కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్షరయజ్ఞంలో భాగంగా మధుగురు ఇన్నోవేషన్‌ కేంద్రాల్లో యువత, మహిళలకు ఉద్యోగాలకు కావాల్సిన నైపుణ్యాల్ని పెంపొందించడం, వ్యాపారానికి కావాల్సిన నైపుణ్యాలు అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 94412 26834, 94915 04405 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం మాయం

● బోరున విలపించిన రైతు
● పట్టించుకోని నిర్వాహకులు



ధాన్యం కాంటా అయినట్లు నమోదైన పేరు



కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

చిన్నగూడూరు: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి రక్షణ లేకుండాపోతోంది. కొనుగోలు కేంద్రంలో ఓ రైతుకు చెందిన 21 బస్తాల ధాన్యం మాయమైంది. ఈఘటన మండల కేంద్రంలోని పీఏసీఎస్‌ కొనుగోలు కేంద్రంలో జరిగింది. మండలంలోని ఉగ్గంపల్లి శివారు ధూమ్యాతండాకు చెందిన రైతు బానోతు వీరన్న పండించిన వరి ధాన్యాన్ని 20 రోజుల క్రితం చిన్నగూడూరు కొనుగోలు కేంద్రంలో ఆరబోశాడు. తేమశాతం వచ్చాక కొనుగోలు నిర్వాహకులు వారం క్రితం 116 బస్తాలకు కాంటా వేసినట్లు తెలిపాడు. కాంటా వేసిన మూడో రోజుకు లారీలో లోడ్‌ పంపించారు. వే బ్రిడ్జి కాంటా అయిన మరో రెండు రోజులకు 95 బస్తాలకే కాంటా అయినట్లు తన ఫోన్‌కు ఓటీపీ రావడంతో ఒక్కసారిగా అవాక్కయ్యాడు. ఇదేంటని కొనుగోలు కేంద్రం చుట్టూ మూడు రోజులుగా తిరుగుతున్నా నిర్వాహకులు పట్టించుకోవడం లేదంటూ రైతు బోరున విలపించాడు. తనకు న్యాయం చేయాలని ఆదివారం తండావాసులతో కలిసి కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేపట్టాడు.

నేడు కాళేశ్వరానికి బీఆర్‌ఎస్‌ బృందం

కాళేశ్వరం: తెలంగాణకు జల భాండాగారమైన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్‌ పన్నిన కుట్రలను పటాపంచలు చేసి ప్రజలకు అసలు వాస్తవాలను వివరించడానికి కాళేశ్వరం గోదావరినది ఒడ్డున (నేడు)సోమవారం ఉదయం 11 గంటలకు చర్చా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలి బీఆర్‌ఎస్‌ ఫ్లోర్‌ లీడర్‌ మధుసూదనాచారి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌, ఎమ్మెల్సీ ఎల్‌.రమణ, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్‌, నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్‌, గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ జెడ్పీచైర్‌పర్సన్లు జక్కు శ్రీహర్షిణి, దావ వసంతతో పాటు సాగునీటి నిపుణుడు వీరమల్ల ప్రకాశ్‌ తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న కుట్రల గురించి కూలంకషంగా చర్చించనున్నారు. ఈకార్యక్రమానికి మంథని నియోజకవర్గానికి చెందిన ప్రజలు, మేధావులు, తెలంగాణ వాదులు హాజరై కాళేశ్వరంపై కాంగ్రెస్‌ చేస్తున్న కుట్రలను పటాపంచలు చేసి ప్రజల్లోకి వాస్తవ విషయాలను తీసుకెళ్లాలని ఆయన కోరారు.